# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 | సంచిక : 146 | గురువారం 29, జనవరి 2026 | పేజీలు: 09 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం

**మైక్రో బేవరేజెస్**
**అనుమతుల్లో ముఖ్య నేత చక్రం**
**లాటరీ లేకుండానే పంపకాలు**
**మంత్రి కోటా కింద ఒకరు నాలుగు...**
**మరో నేత 21 బేవరేజీలు పంచుకున్నారు**
**మాజీ మంత్రి హరీశ్ రావు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
కుంభకోణాలకు కేరాఫ్ గా మారిన కాంగ్రెస్ పాలనలో ఎక్సైజ్ శాఖలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఆ శాఖలో ఓ ముఖ్యనేత, మంత్రి కోటా కింద ఈ అవినీతి జరిగిందన్నారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు ..మిగతా 3లో

## నయీం కేసులో ఛార్జ్‌షీట్

**ఈడీ ఛార్జిషీట్ ను స్వీకరించిన నాంపల్లి కోర్టు**
**2022లోనే మనీలాండరింగ్ కేసు నమోదు**
**ఇప్పటికే రూ.11.30 కోట్ల విలువైన**
**35 ఆస్తులను గుర్తించిన ఈడీ**
**రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల**
**ఆర్థిక లావాదేవీలపైనా ఈడీ ఫోకస్**
**త్వరలోనే పలువురికి నోటీసులు జారీ**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గ్యాంగ్స్టర్ నయీం అక్రమాస్తుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను వేగవంతం చేసింది. మనీ లాండరింగ్ ఆరోపణలపై సుదీర్ఘంగా ..మిగతా 2లో

## ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్

**తనిఖీలకు హైడ్రా కమిషనర్ ఆదేశం**
**సంబంధిత శాఖలతో హైడ్రా సమావేశం**
**నింబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేయడానికి సిద్ధం**
**9000113667 నంబరుకు**
**ఫిర్యాదు చేయాలంటూ విన్నపం**

02




## కారెక్కిన ఆరూరి

**బీఆర్ఎస్ లో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే**
**తెలంగాణభవన్ లో**
**పార్టీలో ఆహ్వానించిన కేటీఆర్**

03





# అమ్మ ప్రణమిల్లి..!

**అట్టహాసంగా మేడారం కుంభమేళా ప్రారంభం**
**తనువెల్లా కనులై ఎదురుసూడంగ.. బిడ్డ సారలమ్మ రాక**
**వెన్నెల వెలుగుల్లో గద్దెపై కొలువుదీరిన కన్నెపల్లి కల్పవల్లి**
**పగిడిద్దరాజు గోవిందరాజు ప్రతిరూపాల ప్రతిష్ఠాపన**
**సారలమ్మకు అధికార లాంఛనాలతో స్వాగతం పలికిన మంత్రి సీతక్క**
**డప్పు వాద్యాలు, సంప్రదాయ నృత్యాల మధ్య గిరిజన దేవతల ఆగమనం**
**నేడు చిలకలగుట్ట నుంచి భరణీ రూపంలో మేడారంకు సమ్మక్క**
**భక్తజనసందోహంతో కిక్కిరిసిన మేడారం**
**జంపన్నవాగులో భక్తుల పుణ్య స్నానాలు**
**శివసత్తుల పూనకాలు, సమ్మక్క సారలమ్మ నామస్మరణ**

**మేడారం, (ప్రజాస్వరం):**
మేడారం భక్తజనసంద్రమైంది. మాఘశుద్ధ పౌర్ణమి ఘడియల్లో ప్రారంభమైన తెలంగాణ ఆదివాసీ జాతరలో తొలి ఘట్టం ఆవిష్కృతమైంది. గిరిజన దేవత సారలమ్మ బుధవారం రాత్రి గద్దెక్కగా ఆమెతో పాటు ఆమె భర్త పగిడిగిద్ద రాజు.. ఆమె అల్లుడు గోవిందరాజు ప్రతిరూపాల ప్రతిష్టాపన అట్టహాసంగా జరిగింది. కన్నేపల్లి నుంచి సారలమ్మ, గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు, ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవింద రాజు ప్రతిరూపాలను ఆదివాసీ సంప్రదాయం ప్రకారం తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్టించారు. కాగా సమ్మక్క ..మిగతా 2లో

## దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

**రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు**
**రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం**
**క్షేత్రస్థాయి వరకు**
**అడ్వాన్స్డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు**
**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ (డిజాస్టర్ మేనేజిమెంట్) విభాగాన్ని బలోపేతం చేసి దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి విపత్తులు వచ్చినప్పటికీ ఎదుర్కొనేలా రూ. వంద కోట్లతో అత్యాధునిక పరికరాలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్డిఆర్ఎఫ్, హైడ్రా, ఐసీసీసీ విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఇందులో ఎలాంటి ..మిగతా 3లో

## మీరు ఏ పార్టీలో ఉన్నారూ..?



**కాంగ్రెస్ లో చేరారా.?**
**బీఆర్ఎస్ లో కొనసాగుతున్నారా..?**
**ఎమ్మెల్యేలు దానం,**
**పాడి కౌశిక్ కు స్పీకర్ నోటీసులు**
**ఈ నెల 30న**
**విచారణకు రావాలని ఆదేశాలు**
**'సుప్రీం' కోర్టు ధిక్కార**
**నోటీసులతో చర్యలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు శాసనసభ ..మిగతా 2లో

## ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక

**మున్సిపల్ ఎన్నికల్లో**
**మెజారిటీ సీట్లు మావే**
**ఎమ్మెల్యేలు, మంత్రులకు**
**సమన్వయ బాధ్యతలు**
**సీఎం రేవంత్**
**నాతో టచ్ లో ఉన్నారు**
**పొత్తుల అంశాన్ని**
**టీపీసీసీ చీఫ్ తేలుస్తారు**
**డిప్యూటీ సీఎం**
**భట్టి విక్రమార్క**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఆచీతూచీ వ్యవహరిస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆయా పట్టణాలు, నగరాలకు చెందిన కీలక నేతలు, ముఖ్య కార్యకర్తల ఏకాభిప్రాయంతో అభ్యర్థులను ఎంపిక చేస్తామని ప్రకటించారు. ఈ బాధ్యతను సంబంధింత ఎమ్మెల్యేలు, మంత్రులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బుధవారం ఖమ్మం ..మిగతా 3లో

## ఐదు కార్పొరేషన్లు.. 70 పురపీఠాలు మావే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
రాంచందరావు
60శాతం మున్సిపాలిటీల్లో
గెలుపే లక్ష్యంగా బరిలో
ముస్లిం ఓటు బ్యాంకుపై
ఆధారపడ్డ కాంగ్రెస్, బీఆర్ఎస్



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
వచ్చే నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో.. బీజేపీ రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా తన సత్తా చాటుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. కనీసం ఐదు కార్పొరేషన్లు... 70 మున్సిపాలిటీల్లో కాషాయ జెండా ఎగురడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ ఎన్నికల్లో 60 శాతం మున్సిపాలిటీల్లో గెలుపే లక్ష్యంగా తాము బరిలోకి దిగుతున్నామని చెప్పారు. బుధవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే రాష్ట్రంలో జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ, గ్రామ పంచాయతీ ..మిగతా 2లో

## గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే అబద్ధం అదే

**కేసీఆర్ ఏడెనిమిది లక్షల కోట్ల అప్పులు**
**చేశారని చెబుతున్నారని ఆగ్రహం**
**పార్లమెంటులో బీజేపీ ఎంపీ**
**అప్పు గురించి అడిగితే రూ.3.5 లక్షల**
**కోట్లు అని తేలిందని వెల్లడి**
**ఈరోజు ఓపిక లేని వ్యక్తి తెలంగాణను**
**పాలిస్తున్నారని సీఎంపై ఆగ్రహం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకటే అబద్ధం చెబుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో ఏడెనిమిది లక్షల కోట్ల రూపాయల అప్పు చేశారని వారు చెబుతున్నారని, కానీ పార్లమెంటులో బీజేపీ ఎంపీ ఒకరు అడిగిన ప్రశ్నకు స్పష్టమైన సమాధానం వచ్చిందని అన్నారు. కేసీఆర్ హయాంలో రూ.3.5 లక్షల కోట్ల అప్పులు అయ్యాయని తేలిందని, అందులో ..మిగతా 2లో

# అమ్మ ప్రణమిల్లి..!



## మీరు ఏ పార్టీలో ఉన్నారూ..?

**మొదటిపేజీ తరువాయి**

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తాజాగా నోటీసులు ఇచ్చారు. అలాగే దానం నాగేందర్ పై అనర్హత పిటిషన్ వేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సైతం స్పీకర్ నోటీసులు ఇచ్చారు. వీరిద్దరు ఈ నెల 30న విచారణకు హాజరుకావాలని వేర్వేరుగా ఇచ్చిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఇదీలావుంటే ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయంలో చేస్తున్న జాప్యంపై సుప్రీంకోర్టు ఈనెల 19వ తేదిన స్పీకర్ కు కోర్టు ధిక్కర నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్లపై చర్యలు తీసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పెండింగ్ లో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్ కు స్పీకర్ నోటీసులు ఇచ్చారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేశారు. దీంతో ఆయన పార్టీ ఫిరాయించారు అనడానికి బలమైన ఆధారాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయనపై స్పీకర్ చర్యలు తీసుకోక తప్పదనే చర్చ హాట్ టాపిక్ గా మారింది. స్పీకర్ చర్యలు తీసుకోకముందే దానం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయాన్ని దానం కూడా ఇది వరకే ప్రకటించారు. ఉప ఎన్నిక వచ్చినా భయపడేది లేదన్నారు. అందులో గెలుస్తానని ప్రకటించారు. కాగా అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి గెలిచిన మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరిపై అనర్హత వేటు ఫిర్యాదులు అందగా వారిలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్పీకర్.. ఇది వరకే అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్యలకు క్లీన్ చిట్ ఇచ్చారు. వీరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గుర్తించారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్ లకు సంబంధించి స్పీకర్ ఇంకా విచారణ జరపలేదు. ఈ క్రమంలో దానం కు నోటీసులు జారీ చేసిన స్పీకర్ త్వరలోనే జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కూ నోటీసు ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది.

**నేను బీఆర్ఎస్ లోనే ఉన్నా : దానం**

ప్రచారం జరుగుతున్నట్టు.. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టత ఇచ్చారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ పై తాజాగా అఫిడవిట్ సమర్పించిన ఆయన పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని స్పీకర్ కు దానం విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ తనను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తనకు సమాచారం లేదన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని దానం స్పష్టం చేశారు. 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లానని చెప్పారు.. అది వ్యక్తిగత హోదాలో మాత్రమేనని వివరణ ఇచ్చారు. మీడియా కథనాల ఆధారంగా పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నట్లు వివరించారు. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదన్నారు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దని స్పీకర్ ను కోరారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్ ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో దానం వాదనపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు..? బీఆర్ఎస్ ఎలా స్పందించబోతోంది అనే చర్చ రాజకీయాల్లో ఆస్తి రేపుతున్నది.

## ఐదు కార్పొరేషన్లు.. 70 'పుర'పీఠాలు మావే

**మొదటిపేజీ తరువాయి**



ఎన్నికల్లో తమ సత్తాచాటామన్న ఆయన మున్సిపల్ ఎన్నికల్లోనూ అదే ఆనవాయితీ కొనసాగిస్తామని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు బీజేపీ ఎప్పటి నుంచో సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆశావాహులకు సంబంధించిన వివరాలతో పూర్తిస్థాయి నివేదికలు త్వరలోనే అన్ని ప్రాంతాల నుంచి రానున్నాయన్నారు. అవి వచ్చిన వెంటనే పార్టీ కమిటీ సమావేశంలో చర్చించి అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ముస్లిం ఓటు బ్యాంకుపైనే ఆధారపడ్డాయని రాంచందర్ రావు విమర్శించారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒకటేనని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు.

### గల్లీ నుంచి ఢిల్లీ వరకు కేసీఆర్ మీద చెప్పే

# అబద్ధం అదే

**మొదటిపేజీ తరువాయి**



కేసీఆర్ గద్దెను ఎక్కే నాటికి రూ.72 వేల కోట్ల అప్పు తెలంగాణకు ఉందని తెలిపారు. అంటే కేసీఆర్ పదేళ్ల కాలంలో చేసిన అప్పు రూ.2.5 లక్షల కోట్లు మాత్రమే అన్నారు. ఆ అప్పుతో కూడా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు.ఆరూరీ రమేశ్ 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించారని, కానీ 2023లో 16 వేల ఓట్లతో ఓడిపోయారని అన్నారు. కానీ ఈసారి భారీ మెజారిటీతో వర్ధన్నపేటలో ఆరూరి రమేశ్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అయితే దయచేసి కొత్త, పాత అని చూడవద్దని, అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ రోజు ఓపిక లేని, తెలివి లేని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

నిత్యం కేసీఆర్‌పై విమర్శలు చేయడం తప్ప ఏదీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డి ఈ రెండున్నర సంవత్సరాలలో లక్షల కోట్ల అప్పులు చేసి ఏం చేశారని ప్రశ్నించారు. రైతు బంధు ఎగ్గొట్టారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయలేదని అన్నారు. అయినప్పటికీ అప్పులు ఎందుకయ్యాయని ప్రశ్నించారు.

మున్సిపల్ ఎన్నికలు మొదలు ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్‌ను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. టిక్కెట్ ఎవరికి ఇచ్చారనే విషయం ఆలోచించవద్దని, గులాబీ కండువా కప్పుకుని వస్తే కేసీఆర్‌గా భావించి ఓటు వేయాలని సూచించారు. కుటుంబం అన్నాక విభేదాలు ఉంటాయని, కానీ బీఫామ్ ఇచ్చాక అందరూ కలిసి పోవాలని అన్నారు. 'గులుగుడు గులుగుడే గుద్దుడు గుద్దుడే' అని వ్యాఖ్యానించారు.

**మొదటిపేజీ తరువాయి**

తనయుడు కన్నెపల్లిలో కొలువైన జంపన్న సైతం వాగు ఒడ్డున ఉన్న గద్దెపైకి చేరుకున్నాడు. ఇలవేల్పులైన తల్లులకు భక్తులు జంపన్న వాగులో పవిత్ర స్నానాలాచరించి నిలువెత్తు బంగారం, పసుపు, కుంకుమ సమర్పించారు.శివసత్తులు, ఒడిబియ్యం, చీరే సారెలతో తల్లుల ముందు ప్రణమిల్లుతున్నారు. ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతమంతా సమ్మక్క సారలమ్మ నామస్మరణతో మారుమోగింది. కాగా ఇప్పటికే కోటి మంది భక్తులు వన దేవతలను దర్శించుకోగా నాలుగు రోజుల పాటు జరిగే ఈ జాతరకు మరో రెండు కోట్ల మంది వరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పని చేసేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకున్నది. మంత్రులు, ఉన్నతాధికారులు మేడారంలోనే మకాం వేసి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. జాతర నిర్వహణ కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది, మేడారం పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి అదనంగా రెండు వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం జాతర ప్రాంతాన్ని 8 జోన్లుగా, 42 సెక్టార్లుగా విభజించిన అధికారులు... జోన్ కు జిల్లా స్థాయి అధికారి, సెక్టార్ కు మండల స్థాయి అధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్న వాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించనున్నారు.

**అధికార లాంఛనాలతో సారలమ్మకు స్వాగతం..!**

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించగా..ఆదివాసీ సంప్రదాయం ప్రకారం సాయంత్రం ఆరు గంటలకు సారలమ్మను కన్నెపల్లి నుంచి మేడారం గద్దెల పైకి తీసుకొచ్చారు. ఆదివాసీ పూజారులు, రాష్ట్ర మంత్రి సీతక్క, ములుగు కలెక్టర్,ఎస్పీ,అదనపు కలెక్టర్లు, ఏఎస్పీలు కలిసి కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారంలోని గద్దెల వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క సారలమ్మకు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. అంతకు ముందు.. ఆదివాసీ పూజారులు కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలను అనుసరిస్తూ కన్నెపల్లి నుంచి మేడారంలోని అమ్మవారి గద్దెల పైకి ఆ దేవతను ప్రతిష్టించడానికి సారలమ్మ కుంకుమ భరిణితో చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు సారలమ్మ గద్దెల వద్ద నిలువెత్తు బంగారాన్ని భక్తులు సమర్పిస్తూ.. మొక్కులు చెల్లిస్తున్నారు.

**నేడు సమ్మక్క ఆగమనం..!**

జాతరలో కీలక ఘట్టం నేడు సాయంత్రం ఆవిష్కృతం కానుంది. సమ్మక్కను.. చిలకలగుట్ట నుంచి కుంకుమ భరణి రూపంలో తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్టించనున్నారు. అంతకు ముందు.. చిలుకలగుట్టపై ఉన్న సమ్మక్క తల్లిని పూజారులు తీసుకొచ్చే వేడుకలో లక్షల మంది భక్తులు పాల్గొంటారు.ఈ సమయంలో పోలీసులు, జిల్లా అధికారుల సమక్షంలో గాల్లోకి కాల్పులు జరిపి మరీ ఘన స్వాగతం పలుకుతారు.

**నేడు వనదేవతలందరీ కొలువు..**

నేడుసమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవింద రాజు, జంపన్న అంతా గద్దెలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. ఈ సమయంలోనే లక్షలాది భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 31 దేవతలిద్దరూ వన ప్రవేశం చేస్తారు.

**గంటన్నర పాటు రహస్య పూజలు**

సారాలమ్మ బుధవారం రాత్రి గద్దెపై చేరనున్న సందర్భంలో వేలాది మంది భక్తులు అమ్మవారి దీవెనల కోసం కన్నెపల్లికి చేరుకున్నారు. అదే సమయంలో ప్రధాన పూజారి సారయ్య గుడిలోకి ప్రవేశించి రహస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజలు ఇతర వ్యక్తులు గుడి సమీపంలోకి చేరకుండా అభ్యుదయ సంఘం సభ్యులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసుకోగా జిల్లా పోలీసు యంత్రాంగం మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేసింది. ప్రధాన పూజారీ సారయ్య తన ఇంటి నుండి బయలు దేరుతున్న సమయంలో భక్తులు ఎదుర్కొని అమ్మవారి దీవెనల కోసం సాష్టాంగ నమస్కారం చేసి ఎదురుగా నిలబడ్డారు. ఈ సందర్భంలో ప్రధాన పూజారిని తాకకుండా పోలీసులు, అభ్యుదయ సంఘ సభ్యులు పర్యవేక్షించారు. నాలుగు గంటల సమయంలో ఆలయంలో చేరుకున్న సారయ్య దాదాపు గంటన్నర పాటు రహస్య పూజలు నిర్వహించిన అనంతరం కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య తన సోదరుడు జంపన్నను ముద్దాడి గద్దెపైకి చేరుకున్నారు. తొలి ఘట్టం బుధవారం రాత్రితో ముగుస్తుండడంతో తదుపరి ఘట్టం మహాదేవత అయిన సమ్మక్కను నేడు సాయంకాలం గద్దెపై చేర్చనున్నారు. దీంతో పూర్తి స్థాయిలో వనదేవతలు గద్దెలపై ప్రతిష్ఠించిన అనంతరం నిండు పండుగ జరగనున్నది.

**బండెనక బండి కట్టి..!**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేంద్రం ప్రజలు సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రతిసారి ఎండ్లబండ్లపై రావడం ఆనవాయితీగా మారింది. ఆ మండలంలో పూర్వీకుల నుంచీ ఈ జాతరకు ఎండ్ల బండి కట్టుకుని పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా కలిసి వస్తున్నామని, ఇప్పుడు తామూ అదే అనుసరిస్తున్నామని భక్తులు చెబుతున్నారు. ఒకప్పుడు మేడారం జాతరకు.. వరంగల్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్ నుంచీ వేలాది మంది భక్తులు ఎడ్ల బండి కట్టుకుని గోదావరి దాటి వచ్చేవారని వివరిస్తున్నారు.

మేడారం జాతరలో భక్తుల రద్దీతో స్వల్ప తొక్కిసలాట చోటు చేసుకుంది. దర్శన క్యూ లైన్లలో తోపులాట జరగడంతో పలువురు మహిళలు, వృద్ధులు కిందపడిపోయారు. ఈ ఘటనలో ఓ మహిళ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ స్పందించి ఆమెను ఆసుపత్రికి తరలించారు. భారీగా తరలివచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోవడంతో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. దీంతో భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కొందరు కన్నీటి పర్యంతరమయ్యారు. దర్శనానికి సమీప ప్రాంతాల్లో దుకాణాల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా నేడు మేడారం జాతరకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జుయల్ ఓరం హాజరుకానున్నారు. ఢిల్లీ నుంచి నేరుగా మేడారంకు చేరుకుని వన దేవతలకు పూజలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ కార్యాలయం వెల్లడించింది,



## నయీం కేసులో ఛార్జ్‌షీట్

**మొదటిపేజీ తరువాయి**

దర్యాప్తు జరిపిన ఈడీ అధికారులు.. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్‌ను దాఖలు చేశారు. ఆ ఛార్జిషీటును పరిగణలోకి తీసుకుని పరిశీలించిన కోర్టు విచారణకు స్వీకరించింది. తెలుగు రాష్ట్రాల్లో ఐశ్వర్యవంతులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులను బెదిరించి రూ. కోట్లు అక్రమంగా సంపాదించిన నయీం 2016, ఆగస్టులో షాద్‌నగర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. అతడి మృతితో బాధితులంతా బయటకు వచ్చి పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారించేందుకు అప్పటి బీఆర్ఎస్ సర్కార్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసింది. విచారణలో దాదాపు 250 కేసులు నమోదు చేయగా.. ఇందులో నయీం 27 హత్య కేసులతో పాటు అనేక నేరాలకు పాల్పడినట్లుగా నిర్ధారించారు. ఈ క్రమంలోనే ఈడీ మనీ లాండరింగ్ ఆరోపణలపై గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఎంటరై దర్యాప్తు చేపడుతోంది. ఈ మేరకు 2022 మార్చిలో నయీమ్ ఆస్తులపై మనీ లాండరింగ్ కేసును నమోదు చేసిన ఈడీ..., ఆస్తులు మొత్తాన్ని నయీమ్ కుటుంబ సభ్యులు హసీనా బేగం ,తహీరా బేగం, సలీమా బేగం, అబ్దుల్ సలీం, అహేలా బేగం, సయ్యద్ నిలోఫర్ ,ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్ ,హసీనా కౌసర్ పేర్ల మీద రిజిస్టర్ చేసినట్లు ఈడీ గుర్తించింది. ఈ క్రమంలో నయీం తన గ్యాంగ్‌తో సంపాదించిన సుమారు రూ.11.30 కోట్ల విలువైన 35 ఆస్తులను గుర్తించిన ఈడీ... పది మందిపై అభియోగాలు మోపింది. అందులో యాదాద్రి భువనగిరి జిల్లాలోని షాపింగ్ కాంప్లెక్స్‌లు, వ్యవసాయ భూములు కూడా ఉన్నాయి. ఈ ఆస్తులన్నీ నయీం తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల పేర్లపై బినామీలుగా రిజిస్టర్ చేసినట్లుగా అధికారులు ధృవీకరించారు. అయితే ఈ కేసులో నయీం భార్య హసీనా బేగంతో పాటు పలువురు కుటుంబ సభ్యుల పేర్లను ఈడీ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా వారు విచారణకు హాజరుకాకపోవడం, ఆదాయపు పన్ను రిటర్న్స్ (ఐటీఆర్) దాఖలు చేయకపోవడంతో ఈడీ కఠిన చర్యలకు సిద్ధమైంది. అవసరమైతే నిందితులపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీ డబ్ల్యూ) జారీ చేయాలని కూడా కోర్టుకు విన్నవించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు.. గ్యాంగ్‌స్టర్ నయీంకు సహకరించిన కొందరు రాజకీయ నాయకులు, పోలీసు అధికారుల ఆర్థిక లావాదేవీలపై కూడా ఈడీ అధికారు ఫోకస్ పెట్టారు. అక్రమంగా సంపాదించిన సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు... తాజాగా ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను స్వీకరించిన నేపథ్యంలో నిందితులకు త్వరలోనే నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.





## ఫైర్ సేఫ్టీపై హైడ్రా నజర్

- **తనిఖీలకు హైడ్రా కమిషనర్ ఆదేశం**
- **సంబంధిత శాఖలతో హైడ్రా సమావేశం**
- **నింబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేయడానికి సిద్ధం**
- **9000113667 నంబరుకు ఫిర్యాదు చేయాలంటూ విన్నపం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఫైర్ సేఫ్టీపై హైడ్రా దృష్టి పెట్టింది. ఫైర్ సేఫ్టీ నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటోంది. వ్యాపార సముదాయాల నుంచి నివాస ప్రాంతాల వరకూ ఫైర్ సేఫ్టీలో ఎక్కడా అలసత్వాన్ని ఉపేక్షంచరాదని నిర్ణయించింది. ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకునేందుకు నడుం బిగించింది. బుధవారం జీహెచ్ ఎంసీ, ఫైర్, విద్యుత్ విభాగాల అధికారులతో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమావేశమయ్యారు. ఫైర్ సేఫ్టీ కార్యాచరణ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సముదాయాలు, ఫర్నీచర్, వస్త్ర దుకాణాలు వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ పాటించకపోతే ఆయా షాపులను సీజ్ చేయాలని నిర్ణయించారు. వెంటనే విద్యుత్ సరఫరా బంద్ చేయాలన్నారు, ఫైర్ సేఫ్టీ లేని వ్యాపార సముదాయంగా నోటీసులు అతికించాలని అధికారులకు సూచించారు.

* 9000113667 నంబరుకు సమాచారమివ్వండి..

అగ్ని ప్రమాదానికి ఆస్కారం ఉన్న పరిస్థితులుంటే వెంటనే హైడ్రా కంట్రోల్ రూం నంబరు 9000113667 కు ఫోను చేసి సమాచారమివ్వాలని హైడ్రా కమిషనర్ నగర ప్రజలను కోరారు. ఎక్కడ అగ్ని ప్రమాదానికి అవకాశం ఉన్న పరిస్థితులున్నాయో కరెంటు లొకేషన్‌తో పాటు.. వీడియోలు, ఫొటోలు పంపించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. నగరంలోని అందరి లక్ష్యం అగ్ని ప్రమాదాలు తగ్గించడమే కావాలని కోరారు. గతేడాది నగరంలో జరిగిన అగ్ని ప్రమాదాలు 36కు పైగా ఉన్నాయని.. నెలకు 3 చొప్పున ఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు.

నాంపల్లిలో జరిగిన ఫర్నీచర్ దుకా సెల్లార్‌లలో లెక్కకు మించిన ఫర్నీచర్‌ను నెట్టులుగా పెట్టారన్నారు. వస్త్ర దుకాణదారులు, ఫర్నీచర్ షాపులతో పాటు ఇతర వ్యాపారాలు చేసిన వారు నిలువలను మెట్ల మార్గంలో, కారిడార్‌లో, సెల్లార్లలో నిలువ ఉంచరాదన్నారు. సెల్లార్ లు వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించాలన్నారు. పేలుడు, మండే స్వభావం ఉన్న వస్తువులు, పదార్థాలు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు.

## అందరి ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక

**మొదటిపేజీ తరువాయి**




జిల్లా మధిరలో పర్యటించిన ఆయన ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించిన ప్రజలు మున్సిపల్ ఎన్నికల్లోనూ మెజారిటీ సీట్లలో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నామన్నారు. తమతో పాటు పార్టీలో కీలక, ముఖ్య, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుని ముందుకువెళ్తామన్నారు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో పొత్తుల అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలోనే నిర్ణయాలు జరుగుతాయన్నారు. ఆయన ఆయా పార్టీలతో చర్చించి పొత్తులపై తుది నిర్ణయం తీసుకుంటారన్నారని భట్టి స్పష్టం చేశారు.విద్యా, ఆరోగ్యంతో పాటు నగరాల్లో మౌలికాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో ముందుకు తీసుకుపోతున్నామని రాష్ట్రంలో దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రేషన్ కార్డులను తాము అధికారంలోకి వచ్చాక ఇచ్చామని అన్నారు. తెలంగాణ ప్రగతి కోసం క్యూర్, ప్యూర్, రేర్ అనే త్రిముఖ వ్యూహంతో ముందుకు వెళ్తున్నామన్నారు. రాష్ట్రంలో సీఎం, డిప్యూటీ సీఎం, కేబినెట్ అంతా ఉమ్మడి కుటుంబంగా ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని రంగాల్లో సమగ్రమైన అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్ పేరుతో ప్రణాళికను విడుదల చేశామన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటి అర తప్ప మిగతావి అన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. ఇటీవల ప్రజాభవన్‌లో మంత్రుల భేటీపై స్పందించిన ఆయన.. తాను ప్రాతినిధ్యం వహిస్తోన్న పార్టీకి చెందిన మంత్రులు నాతో ప్రయాణం చేయకుంటే ఆ వార్తలు రాసే వారితో ప్రయాణం చేస్తారా అని ప్రశ్నించారు. సీఎం విదేశీ పర్యటనలో ఉన్నందునే పాలనపరమైన అంశంలో చర్చించేందుకే మంత్రులతో భేటీ నిర్వహించినట్లు వివరణ ఇచ్చారు. పూర్తి విషయం తెలుసుకునే ఓపిక లేని కొందరు మూర్ఖులు.. పిచ్చి భ్రమలో ఉన్నారన్నారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై స్పందించిన ఆయన... కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని నమ్మి పార్టీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్న వారంతా కాంగ్రెస్ పార్టీ వారేనని భట్టి విక్రమార్క అన్నారు. సాధ్యమైనంత వరకు నిబంధతతో పని చేసే వారికి న్యాయం చేసేందుకు పార్టీ ప్రయత్నిస్తుందన్నారు.

# ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం

**మొదటిపేజీ తరువాయి**

మాట్లాడారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్ కు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. ఇందుకోసం అభ్యర్థుల నుంచి 110 దరఖాస్తులు వచ్చాయనీ ఇందులో తొలుత 25 ఇవ్వబోతున్నట్లు చెప్పారు. అయితే ఇందులో మంత్రి కోట నాలుగు, మరో ముఖ్య నేత కోట కింద 21 మైక్రో బెవరేజులను ఎంపిక చేసుకొని పంచుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సదరు నాయకుడు ఈ మధ్య ముఖ్య నేతకు తోడై, నీడై, ఇంట్లోనే ఉంటున్నాడన్నారు. ఈ మధ్య వార్తల్లో కూడా ఉన్నారని ఆరోపించారు. ఆయన కారు నేరుగా ముఖ్య నేత ఇంట్లోకి వెళ్తుందన్న హరీశ్ రావు.. ఇటీవల ఆ ముఖ్య నేత తిరుపతి వెళ్తే సదరు నేత నీడగా వెంటే ఉన్నాడని ఆరోపించారు. ఒక్కో బ్రేవరీకి రూ. 1.80 కోట్లుగా ధర నిర్ణయించారన్నారు. ఇందులో రూ.ఒక్కటిన్నర కోటి ముఖ్యనేతకు, మిగతా రూ.30 లక్షలు తోడు నీడ కు అని ఆరోపించారు. మైక్రో బేవరేజీల కోసం 110 దరఖాస్తులు వచ్చాయని చెబుతోన్న అధికారులు అలాంటప్పుడు వైన్స్‌లకు లాటరీ తీసినట్టు వీటికి ఎందుకు లాటరీ తీయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడు లేనివిధంగా లిక్కర్ సరఫరా చేసే సంస్థలకు రూ. 4500కోట్లు బకాయిలు పడ్డారని విమర్శించారు. కొన్ని బకాయిలు 16 నెలలకు పైబడి ఉన్నాయన్నారు. గతంలో ఎన్నడు కూడా ఈ విధమైన పరిస్థితి లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 15 రోజుల్లో చెల్లింపులు జరిగేవన్నారు. బకాయిల వల్ల సరఫరా ఆగిపోయిందనీ దీంతో చాలా దుకాణాల్లో సరుకు అందుబాటులో లేకుండా పోతోందన్నారు. ఇతర మల్టీ నేషనల్ కంపెనీలు కూడా సరఫరా నిలిపివేస్తామని లేఖలు కూడా రాశాయన్నారు. వాటాల పంపకాల్లో తేడాతోనే బకాయిలు నిలిచిపోయాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొన్ని బ్రాండ్స్ నిలిపివేసే పరిస్థితి ఉన్నదని దీనితో ప్రభుత్వం ఆదాయం పడిపోతోందన్నారు. ఇప్పటికే హోలోగ్రామ్ టెండర్లు విషయంలో ముఖ్య నేత అల్లుడుకి, మంత్రి కొడుక్కి కావాలని పట్టుపట్టారని ఆరోపించారు.

**బీర్ కంపెనీలకు ఉన్న ప్రాధాన్యత రైతులకు లేదు:**



ఈ ప్రభుత్వం బీర్ కంపెనీలకు ఇచ్చిన ప్రాధాన్యత రైతులకు ఇవ్వడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. మీకు బీర్ల కంపెనీలు ముఖ్యమా... రైతులు ముఖ్యమా అంటే బీరు కంపెనీలే ముఖ్యం అంటున్నారని ధ్వజమెత్తారు. సంగారెడ్డి జిల్లా సింగూరు డ్యాం రిపేర్ పేరు మీద రైతులకు క్రాఫ్ హాలిడే ప్రకటించారని ఈ ప్రాజెక్టు కింద. 40వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదన్నారు. మెదక్ జిల్లా ఘనపూర్ ఆయకట్ట కింద 30వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించారన్నారు. ఇదే సంగారెడ్డి జిల్లాలో ఉన్న బీరు కంపెనీలకు మాత్రం ఎలాంటి ఆటంకం లేకుండా నీటి సరఫలా జరుగుతోందని ఇది మద్యం తయారీదారు ప్రభుత్వమా? లేక రైతు ప్రభుత్వమా? అని నిలదీశారు. అబ్కారీ శాఖ స్పెషల్ సీఎస్ సంగారెడ్డి జిల్లాకు వెళ్లి నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై రైతులకు నీటి సప్లై ఆపి బీర్ల కంపెనీలకు నీటి కొరత రాకుండా చూడండని ఆదేశించారని ఆరోపించారు.

## మున్సిపల్ బరిలో పట్లోళ్ల నర్సిములు

- **అభివృద్ధి, సంక్షేమం మరిచిన కాంగ్రెస్**
- **ప్రభుత్వం మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి**
- **మొదటి నామినేషన్ దాఖలు చేసిన బి ఆర్ ఎస్ చైర్మన్ అభ్యర్థి**
- **పదో వార్డ్ అభ్యర్థిగా పట్లోల నర్సింలు నేషన్ దాఖలు**

**తాండూరు, జనవరి 28( ప్రజా స్వరం):**

తాండూర్ మున్సిపల్ పరిధిలో బుధ వారం 11 నామినేషన్లు దాఖలు అయ్యాయి. పదవ వార్డ్ నుండి బి ఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి పట్లోళ్ల నరసింహులు. తన అనుచరులతో కలసి అధికారికంగా నామినేషన్ సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో గత రెండు సంవత్సరాల నుండి తాండూర్ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలచింది. ఎక్కడ చూసినా రోహిత్ రెడ్డి హాయంలో చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయి. కాంగ్రెస్ శాసనసభ్యులు మనోహర్ రెడ్డి చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమని, అభివృద్ధి అంటే బి ఆర్ఎస్, బిఆర్ఎస్ అంటే అభివృద్ధి అనే కోణంలో రోహిత్ రెడ్డి పాలన కొనసాగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వాగ్దానాలకు, ఆరు గ్యారంటీ అబద్ధపు పథకాలకు మోసపోయి, ఒక మంచి పరిపాలన చేసే రోహిత్ రెడ్డికి అవకాశం ఇవ్వలేకపోయామని, తాండూర్ నియోజకవర్గ ప్రజలు బాధపడుతున్నారని, ఏదేమైనా మున్సిపల్ పురాపోరులో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. అలాగే మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, మున్సిపల్ మాజి వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీప నర్సింలు తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు, అవినీతి రాజకీయాలకు తగిన గుణపాఠం చెబుతామని, ప్రతి బి ఆర్ ఎస్ కార్యకర్త ఒక సైనికుడీలా గడప గడపకు వెళ్లి రోహిత్ రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి ఒక్కరికి వివరించి, మున్సిపల్ పరిధిలో అత్యధిక వార్డుల్లో గెలిచి మున్సిపల్ పోరులో గులాబీ జెండా ఎగరవేస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో 10వ వార్డు బి ఆర్ ఎస్ అభ్యర్థి పట్లోళ్ల నరసింహులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీప నర్సింలు, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాజు గౌడ్, మున్సిపల్ బి ఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ శ్రీశైలం గౌడ్, బి ఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





## దేశానికి రోల్‌మోడల్‌గా తెలంగాణ డిజాస్టర్ మేనేజిమెంట్

**మొదటిపేజీ తరువాయి**

పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ఫైర్ అండ్ సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ-విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్దితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడంతో 2024లో పాలేరు నియోజవకర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేకపోయానని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రజల్లోకి విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్**

హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడంతో పాటు క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని మంత్రి అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలో హైరైజ్డ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమీషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలనీ రాష్ట్రంలో 12 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఉన్నాయన్నారు. ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసీసీ డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి పాల్గొన్నారు.

# కారెక్కిన 'ఆరూరి'

- **బీఆర్ఎస్ లో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే**
- **తెలంగాణభవన్ లో పార్టీలో ఆహ్వానించిన కేటీఆర్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్... బీజేపీకి గుడ్ బై చెప్పారు. అందరికీ షాక్ ఇస్తూ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయనకు గులాబీ కండువా కప్పిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆరూరి రమేష్‌కు మాజీ మంత్రులు హరీశ్ రావు, ఎర్రబెల్లి దయాకర్ రావులు పార్టీలో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. చిన్నప్పుడు ఎవరైనా పిల్లవాడు ఇల్లు తప్పిపోయి తిరిగి వస్తే తల్లిదండ్రులు ఎంత సంబరపడతారో.. నేడు ఇక్కడున్న పెద్దలు కూడా నన్ను చూసి అంతే సంబరపడుతున్నారని వ్యాఖ్యానించారు. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వరంగల్ జిల్లాలో అనేక మంది మీద బురదజల్లి, వారిని రాజకీయంగా ఎదగకుండా చేశారని మండిపడ్డారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డితో ములాఖాత్ అయి వరంగల్ జిల్లాలో అనేక మంది ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు. అప్పటి పరిస్థితులతోనే తాను పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. కడియం శ్రీహరి పార్టీ వీడడంతోనే తాను సొంత ఇంటికి రావాలని నిర్ణయం తీసుకున్నానని ఆరూరి రమేష్ పేర్కొన్నారు.

## మొదటి రోజు 12 నామినేషన్లు దాఖలు...

**మెదక్ జనవరి 28 (ప్రజా స్వరం)**



మెదక్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నామినేషన్లు ల ప్రక్రియ ప్రారంభం అయింది. ఈ సందర్భంగా పోటీ చేసే అభ్యర్థులు ఎన్వోసీ ఇవ్వాలనే నిబంధన ఉండడంతో తమ ఇంటి బిల్లు, నల్లాల బిల్లు కట్టేందుకు బారులు తీరారు. మొదటి రోజు నామినేషన్స్ పూర్తయ్యే సరికి 5 కాంగ్రెస్ పార్టీ, 5 బిఆర్ఎస్ పార్టీ, 2 బిజెపి పార్టీల తరుపున నామినేషన్లు స్వీకరించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. 3వ వార్డు నుంచి బి చంద్రకళ (బీజేపీ), 5వ వార్డ్ నుంచి మామిళ్ళ ఆంజనేయులు (బిఆర్ఎస్), 6వ వార్డు హరిత (కాంగ్రెస్), 9 వ వార్డ్ జుబేర్ హైమద్ (బిఆర్ఎస్), 11 వ వార్డు నస్రిన్ బేగం (కాంగ్రెస్), 11 వ వార్డు కొండన్ సావిత్రి (బిఆర్ఎస్), 14 వ వార్డు దొంతి లక్ష్మి (కాంగ్రెస్), 15 వ వార్డు దొంతి నరేష్‌గౌడ్, 18 వ వార్డు టేక్ శంకర్ (బిఆర్ఎస్), 25 వ వార్డు ఖజా సోయల్ మొయినుద్దీన్ (బిఆర్ఎస్), 28 వ వార్డు బండి పూజ (బీజేపీ), 31 వ వార్డు శివరామకృష్ణ (కాంగ్రెస్) నామినేషన్ దాఖలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.



## అమీన్పూర్ లో అంగరంగ వైభవంగా ప్రారంభమైన సమ్మక్క సారక్క జాతర

- **జోగిని శ్యామల ఆధ్వర్యంలో బోనం ఊరేగింపు నిర్వహించిన మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి**

**అమీన్పూర్, జనవరి 28(ప్రజా స్వరం)**

అమీన్పూర్ డివిజన్ పరిధిలోని సమ్మక్క సారక్క జాతర మహోత్సవం సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం జోగిని శ్యామల నేతృత్వంలో బోనం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ సమ్మక్క సారక్క జాతర సందర్భంగా ప్రతిసారి బోనం ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అమీన్పూర్ డివిజన్ ఆధ్వర్యంలో జాతర కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



## పటాన్ చెరు రిజిస్ట్రేషన్ ఆఫీస్ శంకుస్థాపన కు హాజరైన మంత్రులు పొంగులేటి, వివేక్

- **ఘన స్వాగతం పలికిన నీలం మధు ముదిరాజ్..**

**పటాన్ చెరు, జనవరి 28(ప్రజా స్వరం)**

పటాన్ చెరు లోని కర్ధనూర్ లో నూతనంగా నిర్మించతలపెట్టిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమానికి రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి హాజరయ్యారు. మార్గమధ్యంలో ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మంత్రులిద్దరికి మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. ఇద్దరికి పూల బొకేలు అందించి శాలువలు కప్పి సత్కరించారు. పటాన్ చెరు కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయడంతో పాటు కర్ధనుర్ లో స్థల కేటాయింపు చేసి భవన నిర్మాణం పనులు మొదలు పెడుతున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సబ్ రిజిస్టర్ కార్యాలయ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు సమయం రవాణా ఖర్చులు కలిసి వస్తాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి సహకరిస్తున్నందుకు నియోజకవర్గ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు..



# నేదునూరి మాట నమ్మకం సమర్ధత విజయానికి పునాది

కరీంనగర్ / హైదరాబాద్ ( ప్రజాస్వరం ) :

మనిషి కోరికల పుట్ట కోర్కెల
సాధనకు పోలికలతో
పోటీపడతాడు విజయ తీరాలకు
చేరుకోవాలని కలలు కంటాడు
కలలు కంటే సరిపోదు కదిలే
కాలంతో పోటీ పడాలి సముద్రం
అలలు ఎదురౌతున్నాయని
భయపడితే జీవితం అనే నౌక
విజయ తీరాలను చేరదు
మన సంకల్పమే మనకు దిక్సూచి
మన ఆశ ఆశయం కావాలి
మన శ్రమయే మనకు బలమైన
ఆయుధం మన ధైర్యమే మన
పెట్టుబడి కావాలి
చుట్టూ చీకటి ముసిరిందని
ఆగిపోకు చిరుదివ్వెను
వెలిగించాలి
ఆత్మవిశ్వాసమే మనకు
వెలుగునిచ్చే సూర్యుడు కావాలి
ఒక్కమెట్టు ఎక్కుటకు అలసటను
లెక్కచేయకు వేల మైళ్ళ
ప్రయాణమైన మొదలయ్యేది
ఒక్క అడుగుతోనే అన్న సత్యాన్ని
మరవద్దు పట్టుదలను వదలద్దు
లక్ష్యసాధన వైపు దృష్టిపెట్టు
అపజయాల అనుభవాలను
విజయానికి గుర్తులుగా మార్చుకో
లక్ష్యంవైపు అడుగేయి
కృషి ఉంటే మనిషి ఏతీరానైనా
చేరి గమ్యాన్నిముద్దాడుతాడు
మన పట్టుదలే మనల్ని విజేతగా
నిలబెడుతుంది
మనల్ని మనం ప్రేమించుకోవాలి
మనపై మనకు నమ్మకం
పెంచుకోవాలి
మన సమర్ధతే మన విజయానికి
పునాది
భవిష్యత్తుకై ప్రణాళిక వేసుకో
ప్రణాళిక ప్రకారం పనిచేయి
పెద్ద లక్ష్యాలను చిన్న భాగాలుగా
చేసుకొని క్రమం తప్పకుండా
చేయడమే అసలైన విజయ
రహస్యం
పని విభజన సమస్యసారిణి
పాటించండి లక్ష్యాలను నిర్దేశించు
కోండి వైఫల్యాలను పాఠాలుగా
భావించాలి
భావోద్వేగాలకు లోను కాకుండ
ప్రగతికి ఉపయోగపడని అంశాల
పట్ల ఆలోచనలు మానండి
ప్రతికూల ఆలోచనలకు స్వస్తి
పలకండి నైపుణ్యాలనుమెరుగు
పరుచుకొని ఉత్పాదకతను
పెంచండి మెరుగైన జీవితంతో
ప్రశాంతతో ప్రగతి పథాన సాగండి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ
ఎకనామిక్ ఫోరం
మాజీ కరస్పాండంట్
జస్టిస్ కుమారయ్య
లా కాలేజీ కరీంనగర్
(ఉమ్మడి ఆంధ్రప్రదేశ్
హైకోర్టు చీఫ్ జస్టిస్
జస్టిస్ కుమారయ్య
1969 _1971)
కరీంనగర్



## ఎల్లలు దాటేలా ఏడుపాయల జాతర నిర్వహణ....

- వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదు....
- జాతర యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి...
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ జనవరి 28 (ప్రజా స్వరం)

పవిత్ర ఏడుపాయల వన దుర్గా మాత జాతర ఎల్లలు దాటేలా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మెదక్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, నర్సాపూర్ ఆర్డీవో మైపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పవిత్ర ఏడుపాయల వన దుర్గా మాత జాతరను ఘనంగా నిర్వహించాలని, జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, పార్కింగ్, విద్యుత్, తాగునీరు బార్కెట్స్ లను ఏర్పాటు చేయాలన్నారు. జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మరుగుదొడ్లు, చిత్త సేకరణ, బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణకు ఫాగు లాంటివి ఎప్పటికప్పుడు నిర్వహించాలన్నారు. వివిధ సైన్ బోర్డులు, అంబులెన్స్, మందులు, అంటూ వ్యాధులు రాకుండా చర్యలు, కోవిడ్ 19 కు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రవాణా, బస్సులు, వాహనాలు, గజ ఈతగాళ్లు, అన్ని చోట్ల సీసీ కెమెరాలు, పోలీస్ కంట్రోల్ రూమ్, వివిధ స్టాల్స్, పకడ్బందీగా దర్శనానికి క్యూలైన్ ఏర్పాటు, అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక యంత్రాలు, స్వయం సహాయక మహిళల ఉత్పత్తుల కోసం ప్రత్యేక స్టాల్స్ లను ఏర్పాటు చేసి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. జాతరలో ఏ వస్తువులైన ఎక్కువ ధరలకు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని, జాతరలో అమ్మే తినుబండారాలలో ఎలాంటి రంగులు కలపకుండా చూడాలని, జాతరలో 18 సంవత్సరాలు నిండని వారికి ఎలాంటి మత్తు పదార్థాలు విక్రయించరాదన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో జాతరను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఏడుపాయల కు వెళ్లి శనివారం వరకు జాతరకు సంబంధించి యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## అక్రమ మద్యం నిల్వ చేసిన వ్యక్తి పైన కేసు నమోదు....

మెదక్ జనవరి 28 (ప్రజా స్వరం)



మున్సిపల్ ఎలక్షన్ ల్లో భాగంగా బుధవారం మెదక్ పట్టణం గోల్కొండ వీధి లో అక్రమ మద్యం అమ్మకం చేస్తున్నారన్న సమాచారం తో పట్టణ సీఐ మహేష్ ఆధ్వర్యంలో కల్లెంపేట కిష్ట గౌడ్ ఇంట్లో 26 బాటిల్స్ అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఎలక్షన్ సందర్భంగా డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో ఇంట్లో అక్రమంగా మద్యాన్ని నిల్వ చేసిన వ్యక్తి పైన కేసు నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఎన్నికల్లో మద్యం, డబ్బులకు ఆశ పడి తమ విలువైన ఓటు ను అమ్ముకోవద్దని సూచించారు. ఎవరైనా అక్రమంగా మద్యం, డబ్బులు పంపిణీ చేసినట్లయితే తమ కు సమాచారం ఇవ్వాలన్నారు.

# గ్రామ స్వరాజ్య సాధనలో గ్రామసభలే కీలకం.






కరీంనగర్ / హైదరాబాద్ (ప్రజాస్వరం) :

తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల విరామం తర్వాత గ్రామ పంచాయతీలకు రాష్ట్రప్రభుత్వంఎన్నికలు నిర్వహించింది.ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటర్లు సర్పంచ్ వార్డుసభ్యులనుఎన్నుకున్నారు.పల్లెల్లో గ్రామపంచాయతీపాలకవర్గాలుప్రమాణస్వీకారంచేశాయి.స్థానికస్వపరిపాలనప్రారంభమైంది.గ్రామస్థాయిలోప్రజాస్వామ్యపాలనకుపారదర్శకతజవాబుదారీతనానికిగ్రామసభలుఆయువుపట్టు. .సమగ్రగ్రామాభివృద్ధిలోగ్రామసభకీలకపాత్రపోషిస్తున్నప్పటికీ గ్రామసభలు చాలా చోట్ల నామమాత్రమైనాయి. గ్రామసభ నిర్వహణలో అనేకసమస్యలు సవాళ్లు ఎదురౌతున్నాయి.

**ప్రజల్లో అవగాహన లోపం.**

ప్రజలకు /ఓటర్లకు గ్రామసభ పై అవగాహనలేదు.చాలాగ్రామాల్లో నిరక్షరాస్యత ఉంది. ప్రశ్నించే తత్వంలేదు .గ్రామస్తులకుగ్రామసభఅధికారాలు విధులు బాధ్యతలు పనిచేసే విధానంప్రాముఖ్యత గురించితెలియదు .గ్రామసభఅంటేప్రభుత్వం నిర్వహించే కార్యక్రమం ఒక తంతుఅనితెలుసు.గ్రామసభఅంటేప్రభుత్వకార్యక్రమంఅనేఅభిప్రాయంప్రజల్లోనాటుకొనిఉంది. తమ తలరాతలుమార్చుకోవడానికి తమ బతుకుల్లో వెలుగులు తేవడానికి తమప్రణాళికలు తామే రూపొందించుకునే వేదిక అనే విషయం చాలామంది గ్రామీణులకు తెలియకపోవడం విచారకరం. గ్రామసభ సమావేశాలు ప్రభుత్వ సమావేశాలుగా భావిస్తున్నారే తప్ప గ్రామ అభివృద్ధి కొరకు జరిగే సమావేశంగా భావించడంలేదు. అందువల్ల చాలామంది గ్రామాలలో ప్రజలు/ఓటర్లు గ్రామ సభలో పాల్గొనడానికి ఆసక్తి చూపడం లేదు.

**రాజకీయ జోక్యం_ఆధిపత్యం.**

గ్రామ సభలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. అధికారంలో ఉన్న వర్గంయొక్క ఆధిపత్యం గ్రామసభలో రాజ్యమేలటం గమనార్హం. ప్రభుత్వ లబ్దిదారుల ఎంపికలో అధికారవర్గానికి పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.గ్రామంలో వర్గాల ఆధిపత్య పోరుకు గ్రామసభను వేదికగాఎంచుకుంటున్నారనిపరిశోధనలుతెలుపుతున్నాయి. అధికారపక్షం తమ కార్యకర్తలకు తమ కులం వారికి ప్రాధాన్యత ఇచ్చే సభగా గ్రామసభ మారిపోయింది. గ్రామసభ పై బలమైన సామాజిక వర్గం అధికారం చెల్లించడం తమ నియంత్రణలో ఉంచుకోవడంసామాన్యులు తమ సమస్యలను వినిపించేస్థితిలోలేరు.ఒకవేళహాజరైసమస్యలను సభదృష్టికి తీసుకు వచ్చినప్పటికీ గ్రామపంచాయతీ పాలకవర్గం అధికారులు ఆసమస్యలపై చర్చించడం లేదు . సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించిన దాఖలాలులేవు.సామాన్యుల యొక్కసూచనలు విజ్ఞప్తులు బుట్ట దాకలౌతున్నాయి. అందువల్ల సామాన్యులుగ్రామ సభ అంటే గ్రామంలోఉన్నఆధిపత్య కులాలు అధికార వర్గం యొక్క పోరాట వేదికగా భావిస్తున్నారు. ప్రజావాణిని వినిపించే ప్రజాసంక్షేమం గురించి చర్చించే సభగా పరిగణించడం లేదు.

**కోరం _కనీస సంఖ్య లేకపోవడం.**

గ్రామసభ నిర్వహించడానికి కావలసిన కోరం కనీస సంఖ్యలో(ఓటర్లు) ప్రజలు హాజరు కావడం లేదని వాయిదా వేయడం జరుగుతుంది. గ్రామసభను నామమాత్రంగా నిర్వహించి సంతకాలు తీసుకొని ముగిస్తున్నారు.గ్రామసభకు హాజరుగాని వార్డుసభ్యుల ఇంటికివెళ్లి సంతకాలు తీసుకుంటున్నారు.ఈవిధానం మారాలి.

**గ్రామసభ పల్లె ప్రజాస్వామ్యానికి వేదిక.**

సమిష్టి నిర్ణయాలకు గ్రామసభ వేదికగా మారాలి .పల్లెల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి. మహిళలకు బలహీన వర్గాలకు భాగస్వామ్యం లేకపోవడం.గ్రామసభలకు గ్రామంలోని మహిళలు ఎస్సీలు ఎస్టీలుహాజరుకావడంలేదు.కొన్నిగ్రామాలలో నేటికీ అమలౌతున్న అంటరానితనం. సామాజికకట్టుబాట్లు భయం వల్ల ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించ లేకపోతున్నారు. వారి అభిప్రాయాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడంలేదు.కాబట్టిమహిళాభ్యుదయం ఎస్సీ ఎస్టీ సంక్షేమం అభివృధి సంక్షేమ పథకాలు అమలు అటుకెక్కడం వల్ల మహిళా సాధికారిత యువజన సాధికారిక ఎస్సీ ఎస్టీ సంక్షేమం సంక్షోభంలో పడింది.

**అధికారుల సమన్వయ లోపం.**

ప్రభుత్వానికి సంబంధించిన వివిధ విభాగాల అధికారులు గ్రామ సభకు హాజరుకావడం లేదు ఆఫీస్ గుమస్తాలను తమ ప్రతినిధులుగా పంపిగ్రామసభలోవచ్చినదరఖాస్తులను స్వీకరిస్తున్నారు.అధికారుల్లో సమన్వయ లేదు. గ్రామసభజరుగు నప్పుడు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి.వ్యవసాయంవిద్యుత్తువిద్య మరియు పారిశుధ్యంఆరోగ్యంవిద్య కుసంబంధించినఅధికారులుహాజరు కావడంలేదు.ప్రజలు/ ఓటర్లు అడిగేప్రశ్నలకుసమాధానంఇచ్చేవారు గ్రామసభలో లేకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు గ్రామసభకు హాజరు కావడంపై ఆసక్తి చూపడం లేదు.

**నిధుల కొరత _నిర్ణయాల అమలులో జాప్యం .**

గ్రామసభలోతీసుకున్ననిర్ణయాలను అమలు చేయడానికిగ్రామపంచాయతీల దగ్గర తగిన నిధులులేవు. నిధుల కొరత రాజ్యమేలుతుంది. ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్థిక సంఘం)ద్వారా సకాలంలో నిధులు మంజూరు కాకపోవడం. చాలాగ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కొరతగా ఉన్నాయి.

**స్థానిక సంస్థల అధికారాలు బదిలీ కాలేదు.**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 (బి) 73వరాజ్యాంగ సవరణ చట్టం 1992 ప్రకారం పంచాయతీరాజ్ చట్టానికి నిర్దిష్ట నిబంధనలు ఆయా రాష్ట్రప్రభుత్వాలురూపొందించుకునే అధికారం ఇచ్చింది .గ్రామ సభకు రాజ్యాంగ హోదా ఇవ్వడంజరిగింది. 73 74 వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల సాధికారిత కొరకు రూపొందించిన అంశాలు నేటికిస్థానికసంస్థలకుపూర్తిగాబదిలీ కాలేదు. స్థానిక సంస్థల చట్టంలో పేర్కొన్నఅంశాలునేటికీకాగితాలికేపరిమితమైనాయి.గ్రామపంచాయతీలకుఏఅంశాలపైనిర్ణయంతీసుకోవాలనేవిషయంలోగ్రామ పంచాయతీ అధికారులకు సిబ్బందికిస్పష్టత లేకపోవడం గొప్ప లోపం. సభలో చేసినతీర్మానాలు కాగితాలకేపరిమితమోతున్నాయి.ప్రజలకుగ్రామసభలపైనమ్మకంసడలిపోతుంది .ప్రచారం లేకపోవడం గ్రామసభ ఎప్పుడు నిర్వహిస్తారు ?ఎక్కడ నిర్వహిస్తారు? ఏ సమయంలో నిర్వహిస్తారుఅనేటువంటివిషయంలోస్పష్టతలేదు. ప్రచారంసమాచారం ప్రజలకు ముందే చేరకపోవడం వల్ల చాలామంది ఓటర్లు /ప్రజలు గ్రామ సభలకు హాజరు కావడం లేదని పరిశోధనలో తేలింది. గ్రామ సభ ఉందని చాటింపు వేయడం .నోటీస్ బోర్డు వరకేపరిమితం కావడం వల్ల అందరికి సమాచారం అందడం లేదు .

**గ్రామ సభ నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు పరిష్కారాలు.**

గ్రామసభసమర్థవంతంగానిర్వహించ డంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం తగు సంస్కరణలు ప్రవేశపెట్టి అమలు చేయాలి.

**డిజిటల్ సాధనాల వినియోగం విస్తృత ప్రచారం**

స్వచ్ఛంద సంస్థలు సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలి.గ్రామంలోఉన్నఅంగన్వాడీకేంద్రాల్లోకులసంఘాలకుస్వశక్తిమహిళా సంఘాలకుయువజనసంఘాలకుగ్రామసభనిర్వహణతేదీసమాచారాన్నితెలిపేనోటీస్ ద్వారా తెలుపాలి.

డిజిటల్ సాధనాల వినియోగం పెరగాలి .క్షేత్రస్థాయిలోప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి గ్రామ సభల నిర్వహణలో డిజిటల్ సాధనాల వినియోగాన్నిపెంచాలి . సభసార్ వంటి ఎ, ఐ ఆధారిత సాధనాలు పంచాయితీ నిర్ణయ్ ఆప్ ను ప్రవేశపెట్టారు. వీటి ద్వారా గ్రామసభ చర్చలు రికార్డు చేయడం సులభం. మహిళ యువజన భాగస్వామ్యాన్ని పెంచడానికిస్వశక్తి పంచాయితీ నేత్రి అభియాన్ ప్రారంభించబడింది .యువతను గ్రామ పాలనలో భాగస్వాములు చేయడానికి మోడల్ యూత్ గ్రామసభను ప్రోత్సహిస్తున్నారు.

**సబ్కా యోజన సబ్కా వికాస్.**

సబ్కా యోజన సబ్కా వికాస్ నినాదంతో గ్రామ పంచాయతీ అభివృద్ధిప్రణాళికలరూపకల్పనలోప్రజలనుభాగస్వామ్యం చేయడానికి MCR HRD సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ ద్వారాగ్రామసభల నిర్వహణసామర్థ్యాన్నిపెంచటానికిశిక్షణఅవగాహన కల్పిస్తున్నారు.

PESA చట్ట పరిధిలో గల గ్రామ సభల నిర్వహణ సామర్థ్యాన్ని పెంచటానికి ప్రత్యేక నిధులు కేటాయించి శిక్షణఇస్తున్నారు.గిరిజన ప్రాంతాల్లో స్థానిక పాలన పటుత్వానికి పలు చర్యలు తీసుకుంటున్నారు.

**గ్రామసభ _తీర్మానాలు సమీక్ష.**

గ్రామసభలో తీసుకున్నతీర్మానాలపై ఎప్పటికప్పుడేసమీక్షనిర్వహించాలి. ఆమోదించిన జమఖర్చులు పద్దులు ఆడిట్ నివేదికలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లు ఎంపిక వివరాలు నివేదిక రూపంలో గ్రామసభకుఅందుబాటులోఉంచాలి .ప్రస్తుతంచేపట్టేప్రాజెక్టులుభవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టుల గురించిసమగ్రమైనరిపోర్టులేదాని వేదికలనుగ్రామపంచాయతీలోఅందుబాటులో ఉంచాలి.

**గ్రామసభ ఎజెండా నివేదిక కాపీలు సర్క్యులేట్ చెయ్యాలి.**

ప్రతి వార్డ్ మెంబర్ కిఒక కాపీని సర్క్యులేట్ చేయాలి. గ్రామసభకు హాజరైనటువంటి ఓటర్లకు గత గ్రామసభలోతీసుకున్ననిర్ణయాలుఅమలుమీదసమగ్రసమీక్షనిర్వహించాలి.కార్యక్రమాలనిర్వహణలోఎదురవుతున్నసమస్యలపై సమగ్రంగా చర్చించాలి. గ్రామంలో ఉన్న ప్రతి ఓటరు గ్రామ పంచాయతీఎన్నికల్లో ఓటువేసేటప్పుడుచూయించినఉత్సాహంకంటేరెట్టింపైనఉత్సాహంతోగ్రామసభసమావేశాల్లోపాల్గొనాలి తన గొంతును గట్టిగావినిపించాలి. గ్రామసభలోసామాన్యులఅభిప్రాయాలకు విలువ ఇవ్వాలి.

**ప్రత్యేక బాక్సులు ఏర్పాటు చేయాలి.**

ఓటర్లుగ్రామసభజరగనిసమయంలో తమ సమస్యలనుతెలుపడానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వడానికి గ్రామపంచాయతీలో కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలి.

**ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేయాలి.**

ప్రతిగ్రామపంచాయతీకార్యాలయంలోమెరుగైన గ్రామపాలనకుఅవసరమైనసూచనలుఇవ్వడానికిగ్రామపంచాయతీలో ప్రతి వారం నిర్దేశించిన రోజు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మెరుగైన పాలనలో పల్లె పౌరుల భాగస్వామ్యాన్ని పెంచాలి.రోజువారీగాబాక్సులను తెరిచి వచ్చిన సూచనలను రికార్డు చేసిగ్రామసభలోవాటిపరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలి.

**గ్రామ సభ తీర్మానాలు శాసనం లాంటివి.**

గ్రామసభఅంటేఓటర్లసభగ్రామసభతీర్మానాలు శాసనంలాంటివి . గ్రామ సభప్రజాస్వామ్య వేదిక సర్పంచ్ నుండి సామాన్యునివరకు అందరూ కలిసిసమష్టినిర్ణయాలు తీసుకుంటారు.

**నిధులు వినియోగం నియంత్రణ గ్రామసభ.**

నిధుల వినియోగం నియంత్రణ నివారణలో గ్రామ సభ కీలక పాత్ర పోషిస్తుంది. అవినీతి అంతం చేయడానికి అభివృధి పథకాల్లో జరుగుతున్న అవకతవకలు అరికట్టడంలో గ్రామసభ కీలకపాత్ర పోషిస్తుంది.

**గ్రామసభ ప్రజల వద్దకు పాలన.**

ప్రజల వద్దకుపాలనఅందించడంలో గ్రామసభ వారధి.గ్రామ స్వరాజ్యం సాధనలోప్రభుత్వ యంత్రాంగం క్రియాశీలక పాత్ర పోషిస్తుంది. జిల్లాకలెక్టర్ జాయింట్ కలెక్టర్ వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులుగ్రామసభలసమావేశాలకు హాజరుకావాలి. గ్రామ ప్రజలు ఎదుర్కొనేసమస్యలపరిష్కారానికికృషిచెయ్యాలి.గ్రామంలో వ్యవసాయం విద్య పారిశుద్ధ్యం డ్రైనేజీనిర్వహణ నర్సరీ పెంపకం వ్యవసాయ మార్కెట్ కాలువల నిర్వహణ భూమివివాదాలు గట్టు సమస్యలు పంట పొలాల దగ్గరకు తోవ భూసార పరీక్ష భూసర్వే విత్తనాలు ఎరువులు పశువుల పెంపకం తాగునీరు కోతులు బెడద మొదలగు రైతుల ఇబ్బందులను గ్రామసభలోచర్చించిపరిష్కరించాలి.

**గ్రామ సభ _ప్రజా ప్రతినిధులు.**

గ్రామసభసమావేశాలకుప్రజాప్రతినిధులు ఎంపీలు ఎమ్మెల్యేలు హాజరు కావాలి .ఓటర్లు / ప్రజలు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉంటుంది. తమ సమస్యలను చెప్పుకోవడానికి పార్లమెంటుకు అసెంబ్లీకి ప్రజలు వెళ్లలేరు. ప్రజలందరూ పాల్గొనే గ్రామసభలకు ఎంపీలుఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు హాజరై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.ఎంపీ ఎమ్మెల్యేకుతమ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాతినిధ్యం జరపడానికి గ్రామసభలు తోడ్పడతాయి. ఎంపీ ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు ప్రభుత్వాధికారులు గ్రామ సభలకు హాజరైతే తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే విశ్వాసం ప్రజలకు/ ఓటర్లకు కలుగుతుంది. గ్రామ సభలు విజయవంతం అవుతాయి. గ్రామ స్వరాజ్యం సాకారం అవుతుంది.

**గ్రామసభ_ బడ్జెట్ ఆడిట్ నివేదిక.**

గ్రామ సభగ్రామ బడ్జెట్ ఆడిట్ నివేదికను ఆమోదించాలి. తెలంగాణ గ్రామ పంచాయతీ చట్టం 2018 ప్రకారం సంవత్సరానికి నాలుగు గ్రామ సభలుజరగాలి.ప్రతి ఏటా కనీసం 4సార్లు గ్రామ సభ సమావేశాలునిర్వహించాలి.గ్రామసభతీర్మానాలనుఅమలుచేయకపోతే
సర్పంచ్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు సిఫారసు చేసే అధికారం గ్రామ సభకు ఉంటుంది.

**గ్రామసభ స్వరాజ్య సాధన.**

బాపూజీ భావించిన గ్రామ స్వరాజ్యం సాకారం కావాలంటె గ్రామ సభలో ఎంపీలు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో గ్రామ సమగ్ర అభివృద్ధి కొరకు ప్రణాళికల రూపకల్పన చేయాలి. గ్రామ అభివృద్ధి వ్యవహాలతో కార్యాచరణచేపడితే గ్రామ సమస్యల పరిష్కారమై గ్రామ స్వరాజ్య లక్ష్యం నెరవేరుతుంది.

**గ్రామ సభ_ స్థానిక సంస్థల సాధికారిత.**

ప్రభుత్వం స్థానిక సంస్థలసాధికారిత కు ఆర్థిక పరిపుష్టికిచట్టబద్ధమైన సంస్కరణలు తీసుకొని మెరుగైన స్థానికపాలనకుతగుకార్యాచరణతో ముందుకు వచ్చి గ్రామాభివృద్దే దేశాభివృద్ధి దిశగా సమగ్రమైన చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.

**నేదునూరి కనకయ్య**
**అద్యక్షులు**
**తెలంగాణ ఎకనామిక్ ఫోరం**
**కరీంనగర్9440245771**





# సాయిపేట శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

**మేడ్చల్ / గుండ్లపోచంపల్లి (ప్రజాస్వరం) ;**

గుండ్లపోచంపల్లి 299 డివిజన్ పరిధిలోని ఆర్కల్ గూడ లోని హనుమాన్ ఆలయం మొదటి వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ హనుమాన్ ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్కల్ గూడ గ్రామ ప్రజలందరూ ఎప్పుడూ, సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని ప్రతి ఒక్కరికీ ఆ హనుమాన్ ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు... ఈ కార్యక్రమంలో గుండ్ల పోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్, బాపిరెడ్డి, రవితేజ, రాజు,గుండ వినోద్ పాల్గొన్నారు.



# కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు.....

- **సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ....**
- **నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణ.....**
- **నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ మహేందర్...**

**మెదక్ జనవరి 28 (ప్రజా స్వరం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తును జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి అభ్యర్థితో పాటు ఒకరు లేదా ఇద్దరు ప్రతిపాదకులు మాత్రమే అనుమతించబడతారని తెలిపారు. అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా వాహనాలను దూరంగా పార్క్ చేయాలని, గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు, బారికేడ్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో శాంతియుత, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ సీఐ మహేష్, ఎస్ఐలు లింగం, విఠల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్

- **క్షతగాత్రులను స్వయంగా అంబులెన్సులో ఎక్కించిన అదనపు ఎస్పీ**

**రామయంపేట. జనవరి. 28( ప్రజాస్వరం)**

మెదక్ జిల్లా రామయంపేట మండలంఅక్కన్నపేట గ్రామ శివారులోని అక్కన్నపేట ఫారెస్ట్ పార్క్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్వాపూర్ గ్రామం నుంచి పాతూర్ సంతకు వెళ్తున్న ఆటో అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఢీకొన్న తీవ్రతకు వాహనం పూర్తిగా ధ్వంసమై, ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. అదే వాహనంలో ఉన్న మరికొందరు తీవ్రంగా గాయపడగా, ప్రమాదంతో రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఇదే సమయంలో రామాయంపేట వైపు వెళ్తున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రమాదాన్ని గమనించి వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సహాయపడేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో, ఆయన తన గన్‌మన్ ప్రశాంత్, డ్రైవర్ గోవర్ధన్, మరియు కాట్రాయల్ సర్పంచ్, సహాయంతో గాయపడిన వారిని స్వయంగా అంబులెన్సులో ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడే ఉండి ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి వాహనాల రాకపోకలను సజావుగా నిర్వహించారు. అదనపు ఎస్పీ చూపిన మానవత్వం, సేవాభావం అక్కడున్న ప్రజలను ఆకట్టుకుంది. విధి నిర్వహణకే పరిమితం కాకుండా, ఆపద సమయంలో ప్రజలకు అండగా నిలవడం పోలీస్ శాఖ సేవాతత్వానికి నిదర్శనంగా నిలిచింది



# సమ్మక్క సారలమ్మ కృపతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **బంధంకొమ్ము లో ఘనంగా ప్రారంభమైన సమ్మక్క సారలమ్మ జాతర**

**అమీన్పూర్, జనవరి 28(ప్రజా స్వరం)**

సమ్మక్క సారలమ్మల కృపతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని బంధం కొమ్ములో గల సమ్మక్క సారలమ్మ జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు పాల్గొని అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనం పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం వెళ్లలేని భక్తుల కోసం బంధం కొమ్ములో స్వయం భూగ వెలసిన అమ్మవార్లకు ప్రత్యేక గద్దెలు నిర్మించి గత రెండు దశాబ్దాలుగా సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, గూడెం కల్పన మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ పథకం పేదలకు ఒక జీవనాధారం....



- **మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకే బిజెపి కుట్ర**
- **ఆదాని అంబానీలకు దోచి పెట్టేందుకే విబి జీ రామ్ జీ చట్టం జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగిస్తే సహించేది లేదు**
- **పిసిసి వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్**

**చిన్న శంకరంపేట జనవరి 28 ( ప్రజాస్వరం )**

చిన్న శంకరంపేట మండలం కొరివి పల్లి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరు తొలగించడాని ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు, ఈ నిరసన కార్యక్రమానికి పిసిసి వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ గౌడ్ హాజరయ్యారు వారికి ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ శాలువాలతో సన్మానం చేసి ఘన స్వాగతం పలికారు అనంతరం కొరివి పల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆలయ పూజారి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం పట్ల రైతుల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు, ఉపాధి హామీ కూలలతో మాట్లాడి వారితో సహపంక్తి భోజనం చేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ పిసిసి వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ గౌడ్,మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ లో మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం అనంతపురం జిల్లాలో సోనియా గాంధీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఉపాధి హామీ పథకం పేదలకు ఒక జీవనాధారం అని అలాంటి ఉపాధి హామీ పథకాన్ని తొలగించే విధంగా బిజెపి ప్రభుత్వం చేయడం సిగ్గుచేటని పేదల కడుపు కొట్టే పథకాలను తీసుకువచ్చి పేదలకు ఇబ్బంది కలిగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని వారు అన్నారు, విభీ జీ, రామ్ జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్నటువంటి ఈ పథకం ఆదాని అంబానీలకు దోచిపెట్టడం కోసమేనని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తూ పేదలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు, గ్రామ స్వరాజ్యమే తన లక్ష్యమని గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటదని గ్రామాలలో పేద ప్రజలు మూడు పూటలా తిండి తినాలంటే వారికి ఏదో ఒక ఉపాధి కలిపించాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో ఉపాధి హామీ పథకాన్ని తేవడం జరిగిందని ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ పేద ప్రజలు ఎలా ఉన్నా సరే ఆదాని అంబానీ బంగారు మెతుకులు తినాలని ఉద్దేశంతో పథకాన్ని రద్దు చేసి విధంగా చట్టాలు తేవడం జరుగుతుందని తెలిపారు, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని పేద ప్రజల బతుకులు బాగుపడే విధంగా చూడాలని వారు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మైనంపల్లి హనుమంతరావు,జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు మోహన్ నాయక్, చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగల్ రావు, సర్పంచ్ల ఫోరం జిల్లా ఉపాధ్యక్షులు సాయి కుమార్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి పోతరాజు రమణ, యాదవరావు శ్రీనివాస్ రెడ్డి, పోతరాజు జనార్ధన్, సుధాకర్, మనోజ్ కుమార్, బిక్షపతి, దుబ్బాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సంద్రుగు శ్రీకాంత్, రాజాసింగ్, తదితరులు పాల్గొన్నారు,



# గోపాలమిత్రుల సేవలను రైతులు ఉపయోగించుకోని :డిఎల్డిఏ ఈవో ప్రభాకర్

**జగదేవ్ పూర్ : జనవరి 28, (ప్రజాస్వరం)**

జగదేవ్ పూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ వారు సంయుక్తంగా డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ ఆలేటి కవిత లోలాకర్ రెడ్డి ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ముఖ్యఅతిధిగా డిఎల్డిఏ ఈవో మెదక్ ప్రభాకర్ రావు హాజరయ్యారు. పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు గర్భ నిర్ధారణ పరీక్షలు కృత్రిమ గర్భధారణ సూదులు దూడలకు నటల నివారణ మందులు అందించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ ఉచిత పశు వైద్య శిబిరాలను గోపాలమిత్రుల సేవలను రైతులు ఉపయోగించుకొని పశుసంపదను పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొంతం యాదగిరి ,గోపాలమిత్ర సూపర్వైజర్ భాస్కర్ గౌడ్ ,గోపాలమిత్రులు గౌరయ్య యాదగిరి ,కనక స్వామి, మరియు పాడి రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సీఎం కప్ మండల స్థాయి పోటీలు.. ఎంపీడీఓ ప్రీతి రెడ్డి

**నార్సింగి, జనవరి 28 ( ప్రజా స్వరం )**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ దశ సీఎం కప్ 202526 కు సంబంధించి నార్సింగి మండలంలో మండల స్థాయి క్రీడోత్సవాలు జనవరి 29, 30, 31 తేదీలలో ఉ. 11 గం లకు నార్సింగి పట్టణ కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతాయని ఎంపీడీఓ వంగా ప్రీతీ రెడ్డి తెలిపారు. క్రీడల తేదీల గురించి తెలుపుతూ 29న రోజున వాలీబాల్ అండర్ 18 బాలురు, బాలికలకు పోటీలు, 30న కబడ్డీ పోటీలు మహిళలు, పురుషులకు, 31న ఖో ఖో అండర్ 18న బాలురు, బాలికలకు, అలాగే అదే రోజు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని అన్నారు.



అన్ని గ్రామ పంచాయతీల లోని యువతీ యువకులు, బాల బాలికలు ప్రతి విభాగంలో పాల్గొనే విధంగా కృషి చేయాలని ఎంపీడీఓ వంగ ప్రీతి రెడ్డి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల్లో టీ ఆర్ పీ నీ గెలిపించాలి

**మేడ్చల్ , జనవరి 28 (ప్రజాస్వరం) :**

కార్పొరేట్ రాజకీయాలను మేడ్చల్ జిల్లా ప్రజలు తరిమికొట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగాని హరీష్ శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పలువురు యువకులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీఆర్ పి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సుధాగాని హరీష్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో బీసీలకు 42% రిజర్వేషన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసి సర్పంచి ఎన్నికలను చేపట్టిందని అలాగే ప్రస్తుతం మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు కూడా నిర్వహిస్తుందని మండిపడ్డారు. మేడ్చల్ జిల్లాలోని ఎల్లంపేట, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నుండి పూర్తిస్థాయిలో కౌన్సిలర్ అభ్యర్థులను పోటీకి బరిలో దింపుతున్నట్లు తెలిపారు. ఆయా మున్సిపాలిటీల ఓటర్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా మనవి చేశారు. ప్రజాసేవ చేసేందుకు రాజకీయాలలోకి వచ్చిన వారికే ప్రజలు ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న బీసీల రాజ్యాధికారం కోసమే తెలంగాణ రాజ్యాధికార పార్టీని స్థాపించారని అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ను అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులను ఓడించి టీ.ఆర్.పి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రధాన పార్టీలు బీసీ రిజర్వేషన్ అమలు చేయకపోవడంపై ఎందుకు మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరి శంకర్ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు శాలిని, యువజన విభాగం అధ్యక్షులు అరుణ్ పటేల్ . కార్మిక విభాగం అధ్యక్షులు సాయికుమార్ పటేల్. వైస్ ప్రెసిడెంట్ విక్రం యాదవ్, ముత్యాల శంకర్ యాదవ్, రాంప్రసాద్, శ్రీధర్ యాదవ్, కూకట్పల్లి సోషల్ మీడియా ఇన్చార్జ్ దుర్గాప్రసాద్, కుత్బుల్లాపూర్ సోషల్ మీడియా ఇన్చార్జ్ గజం శ్రీనివాస్, జిల్లా మండలాల ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.




ప్రజాస్వరం PRAJASWARAM తెలుగు దినపత్రిక
29.01.2026
గురువారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com
GENERAL PAGE 06



## తూప్రాన్ మున్సిపాలిటీలో నాలుగు నామినేషన్లు.....

**తూప్రాన్ జనవరి 28(ప్రజా స్వరం)**

తూప్రాన్ మున్సిపాలిటీలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం రోజు 2 3.10.16. నాలుగు వార్డుల లో ఒక్కొక్క నామినేషన్ వేయడం జరిగింది రెండో వార్డులో కొక్కొండ దీపక్ రెడ్డి కాంగ్రెస్ మూడో వార్డులో చిట్టిమిళ్ల అనిల్ కాంగ్రెస్ పదో వార్డులోసంఖ్యా అలేఖ్య యాదగిరి బిజెపి 16 వార్డులో కంటాయపాలెం నవ్య బిజెపి నామినేషన్లు వేశారు మొదటి రోజు కావడంతో నామినేషన్లు తక్కువగా వచ్చాయి రేపు ఎల్లుండి భారీగా నామినేషన్ పడే అవకాశం ఉంది



## బీఆర్ఎస్‌కు గుడ్‌బై కాంగ్రెస్‌లోకి ఖాజీపల్లి నాయకులు

**బొల్లారం, జనవరి 28(ప్రజా స్వరం)**

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వార్డ్ సభ్యురాలు రాజేశ్వరి మహేందర్‌తో పాటు కంజర్ల జగన్, కంజర్ల మహేష్, గద్దె ప్రణీత్, నరేందర్, గౌతమ్ మరియు అనుచరులు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ యువ నాయకులకు కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

## జంగంపేట్‌లో బీఆర్ఎస్‌కు భారీ షాక్

- **50 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరిక**

**జిన్నారం, జనవరి 28(ప్రజా స్వరం)**

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని జంగంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 50 మంది యువకులు గుంపుగా రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ సమక్షంలో యువకులు పార్టీ పతాకం కిందకి వచ్చారు. అనంతరం కాట శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



## తప్పులు లేకుండా నామినేషన్ పత్రాలు నింపాలి....

- **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**మెదక్ జనవరి 28 (ప్రజా స్వరం)**

తప్పులు లేకుండా నామినేషన్ పత్రాలు నింపాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. మెదక్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలలో తప్పులు లేకుండా నింపేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న జుంటుపల్లి వెంకట్

**తాండూర్,జనవరి 28( ప్రజా స్వరం ): :**

తాండూర్ మున్సిపల్ పరిధిలోని వార్డ్ నెంబర్ 19 కి చెందిన బిజెపి నాయకులు జుంటుపల్లి వెంకట్ మరియు పలువురు వార్డ్ కార్యకర్తలు కలసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, స్థానిక శాసనసభ్యులు మనోహర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.



# మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి వుండాలి

- **ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి**

**వికారాబాద్, జనవరి 28(ప్రజా స్వరం):**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి వుండాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. రవి అన్నారు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జనరల్ అబ్జర్వర్ రవి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ , అదనపు కలెక్టర్ లతో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ, ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున ఎన్నికల నియమ నిభందనలు పాటించాలని, విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని, జిల్లా లో వికారాబాద్, కోడంగల్, పరిగి, తాండూర్ నాలుగు మున్సిపాలిటీ లలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించబడునని, ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని, అదేవిధంగా, పట్టణ పరిధిలో ఎన్నికల నియమావళి ని అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడ ఏఎలాంటి పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించిన పనులు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాల మేరకు పూర్తి చేయాలన్నారు. అన్ని సెషన్లకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలింగ్ రోజు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా చేయాలన్నారు. ఎన్నికల సిబ్బందిని గుర్తించి, శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విధులు కేటాయించిన నోడల్ అధికారులు విధుల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రతేక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ క్షేత్రస్థాయి నుంచి పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల విధులలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా, తమకు కేటాయించిన విధులను ఎలాంటి తప్పిదాలకు తావు ఇవ్వకుండ నిర్వర్తించాలని సూచించారు. నోడల్ అధికారులందరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుదీర్, డిపిఓ జయసుధ, డి ఇ ఓ రేణుకా దేవి, పిడి మెప్మా వెంకట నారాయణ, సీపీఓ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, ఆర్ టి ఏ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు ,సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



**అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్**

జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ . బుధవారం కలెక్టర్ చాంబర్ నందు మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్, జనరల్ అబ్జర్వర్ రవి గార్ల సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. మొదటి విడత మున్సిపల్ నిర్వహణకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు 313, ఓ.పీ.ఓ 940 లను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్, డి ఇ ఓ రేణుకా దేవి, ఇ డి ఏం మహమ్మద్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జనవరి 28(ప్రజా స్వరం ):**

నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా విచ్చేసి తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏఏ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే స్వంత నిర్ణయాలు తీసుకోకుండా పై అధికారులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

కలెక్టర్ నామినేషన్ల ప్రక్రియను సందర్శించినప్పుడు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, రిటర్నింగ్, అసిస్టెంట్, వార్డు అధికారులు, ఉన్నారు.




## ఇంటర్ మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్, జనవరి 28 (ప్రజా స్వరం):**

ఇంటర్ మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమావేశమై పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిబ్రవరి 25 వ తేదీ నుండి మార్చి 18వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు 16400 మంది విద్యార్థులు హాజరు కానుండగా, 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రశాంత వాతావరణం లో పరీక్షలను సాఫీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు పరీక్షల సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశించారు. పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని ట్రాన్స్ కో అధికారికి సూచించారు. నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేర్చాలన్నారు. పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఎలాంటి లోటుపాట్లను తావులేకుండా పరీక్షలను సజావుగా కొనసాగేలా సమన్వయంతో పని చేయాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలలో ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ తీసుకు రాకూడదని, పూర్తి స్థాయి లో విద్యార్థులను చెక్ చేయాలనీ, ప్రతి పరీక్ష కేంద్రంలో తప్పనిసరిగా తాగునీటి వసతి అందుబాటులో ఉంచాలని, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను పరీక్ష సెంటర్లలో నియమిస్తూ, ఫస్ట్ ఎయిడ్ కిట్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించి, కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ సమావేశము లో ఇంటర్ మీడియట్ అధికారి శంకర్ నాయక్ ,సత్తయ్య, రుపలక్షిమి డి ఎం ఆర్ టి సి నమ్రత, రామ చంద్రయ్య,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు వస్తుంది

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**వికారాబాద్,జనవరి 28:**


చదువు అనేది ఆయుధం లాంటిదని గుర్తించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం దారూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశానికి కలెక్టర్ ఆకస్మికంగా వెళ్లి సందర్శించారు. కాంప్లెక్స్ సమావేశంలో పాఠశాలల్లో విద్యా బోధనపై ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... విద్య ద్వారా మాత్రమే సామాజిక మార్పు వస్తుందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జవాబు దారితనంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం లాంటి మహనీయుల స్ఫూర్తిని విద్యార్థుల్లో కల్పించి విద్య యొక్క ఆవశ్యకత తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఆంగ్ల భాషపైన పట్టు సాధించేందుకు సరళంగా అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల్లో భయాన్ని తొలగించి గట్టి నమ్మకాన్ని కలిగించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు చదవడం రాయడమే కాకుండా ఇంగ్లీష్ పదాలను అర్థం చేసుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల ల్లో కుటుంబ పెద్దగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులందరినీ సమన్వయంతో నడిపిస్తూ ముందుకు సాగాలని కలెక్టర్ పేర్కొన్నారు. పాఠశాలల్లో పారిశుధ్యంకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా సౌకర్యవంతంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఇంకా మిగిలిపోయిన మరమ్మత్తు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుందామని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు వేయించే పెయింటింగ్ దీర్ఘకాలం ఉండే విధంగానాణ్యవంతంగా చేపట్టాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి లు పాల్గొన్నారు.



## వికారాబాద్ జిల్లాలో 25 నామినేషన్లు దాఖలు

**వికారాబాద్, జనవరి 28 (ప్రజా స్వరం ):**

వికారాబాద్ జిల్లాలో వికారాబాద్, తాండూర్ , కొడంగల్,పరిగి నాలుగు మున్సిపాలిటీలకు వచ్చేనెల 11న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం నుంచి ఈ నెల 30 వరకు ఎన్నికల సంఘం ఆదేశాలతో మున్సిపల్ కార్యాలయాల్లో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో బుధవారం 24 మంది అభ్యర్థులు 25 నామినేషన్ దాఖలు చేశారు. తాండూర్ లో 11, వికారాబాద్ లో 12 , పరిగీలో రెండు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కొడంగల్ లో మాత్రం ఒక్క నామినేషన్ కూడా వేయ కాలేదు. బీ, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా కౌన్సిలర్ స్థానాలకు నామినేషన్ వేయడం జరిగింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999